# పంకజాలు

అక్కినేని కుటుంబరావు


"మీకెందుకండీ ఈ సినిమాలు" అన్నాడు రామనాథం.

కేశవరావు ముసిముసిగా నవ్వాడు. అతని నవ్వును చూసి వాళ్ళిద్దరి మధ్యా టీపాయ్ మీదున్న రెండు గ్లాసులూ నిండుగా – అరవైల నాటి విషాదాంత తెలుగు సినిమా చివరి రీల్లో హీరోలా విషాదంగా నవ్వాయి.

రామనాధానికి మతిపోతోంది. డ్రింక్స్ తాగడట! ఓకే! 'సిగరెట్టు' 'వద్దు' 'నాన్‌వెజ్' 'వద్దు' ఏదడుగు! 'వద్దు'....

రామనాధానికి అంతుచిక్కని వాటిల్లో కేశవరావు నవ్వొకటి! రామనాధమూ అతని అసిస్టెంట్లూ నవ్వినవ్వి, నవ్వలేక పొట్టలు పట్టుకుని దొర్లుతున్నా, కళ్లనీళ్లు తుడుచుకుంటున్నా – తనకేమీ పట్టనట్టు గంభీరమైన మౌనంతో, చూపుల్తో ఎవరూ వూహించని సందర్భంలో, ఏ అసిస్టెంటు మాటకో నవ్వుతూ వుండే కేశవరావు రామనాధానికో పెద్ద పజిల్!

తానెంత పెద్దగా నవ్వినా, కనీసం మొహమాటానికైనా నవ్వని కేశవరావుని చూసి 'ఇలా అయితే ఇక పైకొచ్చినట్టే' అనుకున్నాడు రామనాథం. తానింత పైకొచ్చాడంటే దీనివెనక ఎన్ని అసందర్భపు నవ్వులు దాక్కుని



వున్నాయి.

ఒకప్పుడు తాను చెయ్యని పనుందా? టీలందించడం దగ్గర్నుంచి, రికార్డింగ్ గేట్ల దగ్గర కాపలా దగ్గర్నుంచి, సెట్లో పనులు, ఆర్టిస్టులకు కుర్చీలెయ్యడం, ఫుడ్ అరేంజ్మెంట్లు... వకటా రెండా... ఎన్ని పనులు ఎంతమంది దగ్గర చేశాడు. ఏ పనయినా చేసి, ఎదుటివాడు... ముఖ్యంగా.. తనపైవాడు... మాట్లాడిన ప్రతిమాటనీ ఆరాధనీయంగా తన్మయుడై విని, తలూపి 'నమ్రతగా శ్రద్ధగా వింటాడు కుర్రాడు' అన్పించుకోబట్టి గదా సినిమా దర్శకుడయింది!

రామనాథం తన అసిస్టెంట్లతో తన అనుభవ సారాన్ని చెప్తూ ''నువ్వు సినిమాల్లో స్థిరపడాలనుకుంటే, అభిమానం, అవమానం, లాంటి పిచ్చిమాటలకు విలువివ్వకు! అవన్నీ నువ్వొక స్థితికొచ్చాక చెప్పాల్సిన మాటలు! ఇక్కడ బతకాలని వచ్చావా అయితే చచ్చినట్టు పడుండు. ఎదగాలనుకుంటున్నావా అయితే తల లేపి ఎవర్నీ ప్రశ్నించకు. అసలు చూడకు. తలొంచుకుని 'మీదే కరక్టు సార్' అను. అందరూ నిన్ను యిష్టపడ్తారు. ఏదో ఓరోజు... నీరోజు వస్తుంది! అప్పుడు నీ యిష్టం. ఏమిటి?''

అసిస్టెంట్లందరూ ముక్తకంఠంతో ''సెంట్ పర్సెంట్ మీరే కరెక్టు సార్'' అన్నారు. కాబట్టే ఆయనగ్గర నిలవగలిగారు!

కేశవరావు రచయిత! అతనీమధ్య రాసిన ఓ నాటకం తెలుగునాట అన్ని పరిషత్తుల్లోనూ సంచలనం రేపింది. ఆ మాట విన్న రామనాథం కొత్తదనంకోసం కేశవరావుని మద్రాసు పిలిపించాడు. తెలుగు సినిమా రంగంతోపాటు తనూ భాగ్యనగరానికెళ్ళిపోయినా, స్టోరీ సిట్టింగ్స్ మాత్రం మద్రాసులోనే పెట్టుకుంటాడు. రామనాథంకున్న సవాలక్ష సెంటిమెంట్లలో ఇదొకటి మాత్రమే. సరే అతను చెప్పిన కథ విన్నాడు. కథలో హ్యూమన్ డ్రామా, సెంటిమెంటు... అన్నీ వున్నాయి. అన్నిటికన్నా కథనం కొత్తగా వుంది. సినిమాకి బాగా పనికొస్తుంది.

''కథ నాకు బాగా నచ్చింది. వెంటనే సినిమా మొదలెడ్దాం. మీరీ కథ యింకెవరికీ చెప్పలేదుగా'' అన్నాడు రామనాథం.

''చెప్పలా! ఏం?''

''ఏంలేదు. మనం వెంటనే మొదలెట్టకపోతే, ఈ కథలో ముఖ్యమైన పాయింటుతో, మనం షూటింగ్ మొదలెట్టకముందే, మరో సినిమా విడుదలవుతుంది'' అన్నాడు రామనాథం.

''అట్లా ఎట్లా అవుతుంది! కథ నాది. పర్మిషన్...''

''అదేం అక్కర్లా! మార్పులు చేస్తారు. ఇక్కడ తండ్రి యాక్సిడెంట్లో పోతే, అక్కడ పక్షవాతంతో మంచానపడతాడు. ఇక్కడ తల్లి వుంటే, అక్కడ వుండదు. అయిపోయింది! అదిక నీ కథ కాదు'' అన్నాడు రామనాథం. అతనలా నాలుగైదు సినిమాలు కొట్టేశాడంటారు!

''అయితే వెంటనే మాటలు రాయడం మొదలెడ్తాను'' త్వరపడ్డాడు కేశవరావు.

''మీరు చేసేదేదో చెయ్యండి! సెట్స్‌లో ఎలాగూ మార్పులూ చేర్పులూ వుంటాయిలే!''

''అప్పటికప్పుడు అంటే సరైన పద్ధతిలో వుండదేమో...''

''నేనుంటాగా! మీకు రానివి నేను చెప్తాలెండి..''

కేశవరావు హతాశుడయ్యాడు.

అవ్వక చస్తాడా! తను రాసిన కథలో రెండు వాక్యాలు తీసేశాడని ఓ ప్రముఖ పత్రికలో సంపాదకుడైన తన మిత్రుడితో మాట్లాడ్డం మానేసిన వాడు కేశవరావు!

కేశవరావుకి మద్రాసు కొత్త! త్యాగరాయనగర్ లోని ఆఫీసు నుంచి బైటపడి, పచ్చిపుండులా వున్న బుర్రని ఏదో ఓ పుల్లలాంటి మాటల్తో పొడుచుకుంటూ సముద్రమంత దుఃఖంతో సముద్రపొడ్డుకి చేరాడు!

సినిమా అంటే అతనికో ప్రత్యేకమైన గౌరవముంది. కథో నవలో రాస్తే ఎంతమంది చదువుతారు. నాటకమేస్తే ఎంతమంది చూస్తారు? అసలెన్నిసార్లు వేస్తారు! అదే సినిమా అయితే? ఎంతమందిని ప్రభావితం చెయ్యొచ్చు! ఎక్కువమంది ప్రజలతో తన అభిప్రాయాలు పంచుకోగలగడం అనే ఒకేఒక్క కారణంతో అతను సినిమాని చిన్నచూపు చూడకూడదనుకుని రామనాథం పిలవగానే మద్రాసు వచ్చాడు. రామనాథం తీసిన కొన్ని సినిమాలు చూశాడు. కాని అతనికి వాటిల్లో ఒకటి కూడా సున్నితంగా కన్పించలేదు. అదే మాట రామనాథంతో అన్నాడు కూడా.

రామనాథం కేశవరావన్న మాటని గంభీరంగా విని, తలూపి, 'అది మీ అభిప్రాయం' అన్నాడు.

## మాధుర్ 'బలాత్కార్'

సినిమా పరిశ్రమలో ఏదీ శాశ్వతం కాదు. ఎవరూ శాశ్వతం కాదు. నిన్న ఎవరినైతే పొగుడుతారో ఇవాళ వాళ్లని అలవోకగా తిడతారు. మాధుర్ భండార్కర్‌ది ఇవాళ అదే దుస్థితి. నిన్నటిదాకా అతను ఓ సంచలన దర్శకుడు. ఇవాళ సినిమా వేషాలకోసం వచ్చే అభం, శుభం తెలీని ఆడపిల్లలను అనుభవించే కాముకుడు. చాందినీ బార్ తళతళలన్నీ ఇవాళ అతని జీవితం నుంచి అంతర్ధానమయ్యాయి. మాధుర్‌ను పరిశ్రమ ఏమని పిలుస్తోందో తెలుసా? మాధుర్ బలాత్కార్!!! సినిమాల్లో కథానాయిక వేషాలిప్పిస్తానని మోసం చేసి దరిదాపు నాలుగేళ్ల తనను పలుమార్లు అనుభవించాడని మాధుర్ మీద ప్రీతీజైన్ అనే బుల్లితార కేసు పెట్టింది. అంతే అతని బతుకు బందరు బస్టాండయింది.







## వూల్‌వర్త్ టవర్

న్యూయార్క్ మోడ్రన్ సిటీ గానే కాదు చారిత్రక నగరం కూడా. ఎన్నో చారిత్రక కట్టడాలు అక్కడే వున్నాయి. అందులో భాగమే వూల్ వర్త్ బిల్డింగ్ ఒకటి. 1913లో నిర్మించిన ఈ టవర్‌ను అద్భుతంగా నిర్మించారు. దీని ఎత్తు సుమారు 241 మీటర్లు. ఆకాశం అంచులు తాకి నట్టుగా కని పించే ఈ టవర్... ఏడు దశాబ్దాలైనా చెక్కుచెదర కుండా వుంది.

''దాన్లో సందేహమేముంది? పూర్తిగా నా అభి ప్రాయమే! మీరడిగింది కూడా అదేగా'' అన్నాడు నిర్మొహమాటంగా కేశవరావు.

''కోట్లాది జనం నా సినిమాలు చూసి జేజేలు పలుకుతున్నారు'' అన్నాడు రామనాథం!

''పలకొచ్చు.... అంతమాత్రాన అది గొప్ప సినిమా అయిపోదు. మీరు తీసిన సబ్జెక్టే. అదే కథతో, అదే నటుల్తో, కాస్త శ్రద్ధపెడ్తే యింకా యమాగా తియ్యొచ్చు! అదీ అదనంగా ఖర్చు చెయ్యకుండానే'' అన్నాడు పంతంగా కేశవరావు.

కేశవరావూ తానూ మాట్లాడుకునేటప్పుడు సాధ్యమైనంతవరకూ ఎవరూ లేకుండా చూసు కుంటున్నాడు రామనాథం.

మామూలుగా అయితే కేశవరావుని వెంటనే బండెక్కించేవాడే! కాని అతనిలో వున్న స్పార్క్ రామనాథాన్ని ఆకర్షించింది. ఆ స్పార్క్‌తో ఎంత డబ్బయినా సంపాదించవచ్చనేది రామనాథానికి తెలుసు. డబ్బు సంపాదించడానికి ఎటువంటి పన్న యినా చెయ్యొచ్చన్నది రామనాథం సిద్ధాంతం! నమ్మకం!

అహాన్ని అదుపులో వుంచుకోవడమనేది డబ్బు సంపాదించాలనుకునే వాళ్ళు చెయ్యాల్సిన పనుల్లో మొదటిదనీ అతనికి తెలుసు.

కేశవరావు చూస్తున్నాడు. రామనాథం ఆఫీసుకి రకరకాలవాళ్లు వస్తూ పోతూ వున్నారు. వారిలో కొందరి పేర్లు తనకి తెలుసు. రచయితలు.. కళాకా రులు.. పెద్దవాళ్లు... చిన్నవాళ్లు... దాదాపు అందరి లోనూ హిపోక్రసీ, అతివినయం. అన్నిటినీ మించి వెకిలిదనం... కేశవరావుని బాధించాయి. అతని మనసుని హింసపెట్టాయి. అతన్ని కలవరప ర్చాయి. వాళ్ల అసహజ ప్రవర్తనలు. సహజంగా దాదాపు ఎవరూ ప్రవర్తించటంలా!

''రాత్రికి... మీ గదికి ఓ వర్ధమాన తార వస్తుంది... అహ మీరు కావాలంటేనే...'' అని కేశవ రావు మొహంలో రంగులు చూసి ఆగాడు రామ నాథం.

కేశవరావుకి కడుపులో తిప్పినంత పనయింది. ''అటువంటిది నాకిష్టం వుండదు. నాకోసం మీరేమీ చెయ్యొద్దు'' కోపంగా, అంతకన్నా గాయపడిన హృదయంతో అన్నాడు.

''మాకో బాధ్యతుంటుంది గదా!''

''మీకు నా యడల వున్న బాధ్యత నేనడిగిన ప్పుడు నాకింత తిండి, నాలుగు తెల్లకాగితాలు... అంతే! నాకంతకుమించి ఏమీ అక్కర్లా! ఏమైనా అవసరమైతే నేనే అడుగుతాను''

''ఏదీ మీరింతవరకూ నోరు తెరిచి 'నాకిది కావాలి' అని అడగలా! మొహమాటపడ్తున్నారని... నా బాధ''.

''నాకు మొహమాటం లేదని మీకీసరికే తెలి సుండాలి!''

''మిమ్మల్ని మంచి మూడ్స్‌లో వుంచడం మీకోసం కాదు. మాకోసమే!''

''మంచిమాటన్నారు. నేను మంచి మూడ్స్‌లో వుండాలనుకుంటే నేనడిగేవరకు నాకు 'టీ' కూడా 'ఆఫర్' చెయ్యకండి''

''సరే! మీరలా అంటే అలాగే కానివ్వండి'' అని కాసేపాగి – ''అందరూ మీలాగా వుంటే ఈ పరి శ్రమ ఇలా వుండేది కాదు'' అన్నాడు.

కేశవరావు మరోసారి రామనాథాన్ని చూసి వూరుకున్నాడు.

రామనాథం ఈ పరిశ్రమ గురించీ, దీనిలో పెద్దలుగా పేరుపొందిన వారి గురించీ పేరుపే రునా వుదహరిస్తూ, తిండిదగ్గరా, తాగుడుకోసం, ఆడవాళ్లకోసం... ఒకటేమిటి? నిర్మాత డబ్బు అనే దాన్లోంచి ఒక్క రూపాయికోసమైనా ఎంత చీద రగా, కక్కుర్తిగా, ఆత్మాభిమాన రహితంగా ప్రవర్తి స్తారో చెప్తూ...

''అవన్నీ అలవాటయిపోయి వున్నవాళ్లం. మీ యెడల ఏమన్నా తప్పుగా ప్రవర్తించినా ఏమనుకో కండి'' అన్నాడు రామనాథంలోని మనిషి!

రామనాథానికున్న పేరు – రామనాథం లాంటి ఎంతోమందికొచ్చిన పేరు, డబ్బూ, కేవలం అదే వృత్తిని నమ్ముకుని చేస్తున్న కృషి ఫలితం తప్ప, వాళ్ళల్లో ఏ ప్రత్యేకతా లేదనేది అర్థం అయింది కేశ వరావుకి! ఓ వృత్తిని నమ్ముకోవడం, దానిమీద కృషి చెయ్యడమే వాళ్ల ప్రత్యేకత. 'సినిమా'ని సామాజిక బాధ్యతగా భావించేవాళ్లు లేకపోగా, వ్యాపారంగా ఆ మాటకొస్తే డబ్బొస్తుందంటే ఎంత దిగజారడాని కైనా సిద్ధపడే వ్యాపారస్తులే యిప్పుడిక్కడ!

తెలుగుదేశంలో మేధావులకి కొరత లేదుగాని వారికి 'సినిమా' అంటే చిన్నచూపు!

సినిమాలో వున్న వాళ్లల్లో ఎక్కువమంది రామ నాథానికన్నా తక్కువస్థాయివాళ్లే! డబ్బు వస్తుం దంటే ఏమైనా చూపిస్తాం అని ధైర్యంగా చెప్పి మరీ చేస్తున్నవాళ్లు. పాతతరం దర్శక నిర్మాతలు వీరికి ప్పుడు హాస్యాస్పదంగా వుంటారు. వాళ్లు మానవ సమాజానికిచ్చిన సందేశాలు వీళ్లకి తెలియవు.

తనకి 'సినిమా రంగం' గురించి చాలా తక్కువ తెలుసని కేశవరావుకి యిక్కడికొచ్చాకే తెలిసింది.

అందువల్లే 'ఈ బురదలోకొచ్చిపడ్డానేరా బాబూ' అని చాలాసార్లు అనుకున్నాడు.

ఇక్కడ స్వంత ఆలోచనతో పనిలేదు. కేశవరావు త్యాగరాయనగర్‌లో బైల్దేరేముందు జరిగిన సంగతులు వద్దన్నా గుర్తొస్తున్నాయి.

రామనాథం వస్తూనే పది ఇంగ్లీషు కేసెట్లు తెచ్చి కేశవరావుకిస్తూ ''ఇవి చూడండి. అన్నీ సూపర్‌హిట్లే! ఒక్కోదాన్లో కనీసం రెండు మూడు సీన్లన్నా మనం వాడుకోవాలి'' అన్నాడు.

కేశవరావుకామాటలసలు అర్థం కాలేదు. రామనాథం వివరించాక ''మన కథకవెలా వుపయోగపడ్తాయ్''

''అక్కడే చూపాలి మన ప్రతిభ. ఉపయోగించుకోవాలి. ముందు చూడండి''

కేశవరావు అప్పటికే రాసిన సీన్లు చదవొద్దనుకున్నాడు... కాని రామనాథం –

''మీరేమన్నా రాశారా'' అన్నాడు నవ్వుతూ.

వాళ్లు పెట్టిన తిండి తింటూ 'ఏమీ రాయలేద' న్లేక 'రాశా'నన్నాడు.

''చదవండి''

చదివాడు.

''బాగుంది'' అని ఆగి, కాసేపుండి, ఎందుకు చెప్తున్నాడో తెలియకుండానే, చాలాసేపు ఈ మద్రాసు మహానగరంలో ఎన్ని సంవత్సరాలు ఎంత నరకయాతనలు పడి ఈ స్థితికొచ్చాడో వివరించాడు.

రామనాథం చెప్పకపోయినా కేశవరావుకి అర్థమైందేమిటంటే –

అలా సంపాదించిన ఈ సంపదా, పేరూ, స్టేటస్సూ ఎప్పుడు మాయమయ్యిపోతాయోననే టెన్షన్, అశాంతి రామనాథాన్ని అనుక్షణం ఏ పని చెయ్యబోయినా – తినేస్తున్నాయి.

''సీన్లు చాలా బాగున్నాయి. మాటలు అద్భుతంగా పడ్డాయ్! కాని ఈ జనం వున్నారు చూశారూ. తిక్కవెధవలు. కుదురు తక్కువ్వాళ్లు. వీళ్లని నమ్మడానికి వీల్లేదు. అందుకే, మనం సాధ్యమైనంత వరకూ హిట్టయిన సినిమాల్లోంచి సన్నివేశాల్ని తీసుకోవాలి. అప్పుడే మనకి నమ్మకం. అయినా యిప్పుడు ప్రతివాడూ కేసెట్ల మీద ఆధారపడి తీస్తున్నారు... మీకు తెలవదేమోగాని''

''నాకు తెలవదు గాని.. మరీ అలా తీస్తున్న సినిమాలన్నీ ఆడుతున్నాయా?'' అన్నాడు కేశవరావు.

''అన్నీ ఎప్పుడూ ఆడవు''

''మరలాంటప్పుడు మంచివనుకున్నవి తియ్యొచ్చుగా.''

''మంచి అనేమాట వాడకుండా 'విషం' పెట్టండి తినేస్తారు మన బయ్యర్లు''

ఇక ఈయన్తో ఏం మాట్లాడ్తాడు కేశవరావు. 'వీళ్లని చూస్తోంటే నిజంగా దిగులేసేలా వున్నారు' అనుకున్నాడు.

అతనికి మరొకటి కూడా స్పష్టం అయింది. తనీ రంగంలో నిలబడలేడు.

రామనాథానికి ఈ సినిమా చేస్తానని వప్పుకున్నాడు. చేస్తాడు. కుదరకపోతే వెళ్ళిపోతాడు. అని నిర్ణయించుకున్నాక మనసు శాంతంగా వుంది. అప్పుడతని కళ్లముందు ఆడుకుంటున్న పిల్లలు, ఇల్లల్లా సముద్రాన్ని చూసి కేరింతలు కొడ్తున్న పెద్దలూ... పిల్లల్నీ పెద్దల్నీ చూసి ఎగిసిపడ్తున్న సముద్రమూ అన్నీ కనపడ్డాయి.

చీకటిపడ్తోండగా లేచి బైల్దేరాడు. రామనాథం గుర్తొచ్చాడు. శాంథోమ్ బీచ్‌కి నడిచి వెళ్లివచ్చానని చెప్తే 'సినిమాల్లోకి తనెలా పనికిరాడో' మరో మారు చెప్తాడు కాబోలునని నవ్వుకుంటూ నడుస్తున్నాడు.

ఉన్నట్టుండి అతని మనసు మళ్లీ అశాంతి పడ్తోంది. ఈ రంగాన్ని వదిలి వెళ్లిపోతాననుకోగానే ఏర్పడ్డ శాంతి నెమ్మదిగా అశాంతిలోకి మారుతోంది. అన్నీ అనుకూలంగా వుంటే పనిచేసి సాధించేద్దామనుకునేంత అల్ప స్వభావమా తనది! ఎన్ని అననుకూలమైన పరిస్థితుల్నయినా తనకనుకూలంగా మార్చుకోవడంలోనూ, ఎన్ని కష్టాలెదుర్కొనయినా తన గమ్యం చేరడంలోనూ తను దిట్ట అని గదా తన గర్వం... మరికొంత మంది మనుషుల కృత్రిమ ప్రవర్తనకే జడిసి పారిపోదామనుకునే ఈ మానసిక స్థితిని ఏమనుకోవాలి?

ఈ రంగం బాగోకపోతే ఏ రంగం బాగుంది? అయినా బాగున్నదాన్లో చెయ్యడానికేం వుంటుంది. అసలు ఎక్కడ బాగుంది. రాజకీయ రంగం ఎలా వుంది? అంతర్జాతీయంగా దేశాలెలా వున్నాయి. గ్రామ రాజకీయాలెలా వున్నాయి. కుటుంబ రాజకీయాలెలా వున్నాయి. విద్యారంగం బాగుందా? వ్యాపార రంగం? వైద్య రంగం? అన్నీ తల్చుకునేసరికి కేశవరావుకి పిచ్చెక్కినంత పనయింది. అతనికి ఈ అన్ని రంగాల్లో జరుగుతున్న అవకతవకలూ, స్వార్థాలూ అమానుషత్వాలూ అన్నీ తెలుసు. అన్నిట్లోనూ ప్రధానంగా యేలుతోంది ధనమూ అధికారమూ. అది తప్ప ఏ రంగంలో చూసినా మరోటేదీ లేదివ్వాళ. మళ్లీ అన్నిరంగాల్లోనూ 'మంచి'కోసం 'మార్పు'కోసం తపనపడ్తున్న, ఎంతోకొంత, తమకి చేతనైంది చేస్తున్న 'మంచి మనుషులు' అదే 'చాదస్తులు' వున్నారు. సినిమా రంగంలోనూ కొద్దిమందే అయినా మంచివాళ్లూ వున్నారు. వుంటారు. వీళ్లలానే తనూ... తనలాంటి మరి కొందరూ తపనపడాలి! నలగాలి! కేశవరావు ఆలోచనలకోరూపం వస్తోంది.

రోడ్డుమీద నడుస్తూ ఎడమ చేతివైపున్న గేటు దగ్గర నేమ్ ప్లేటు చదివాడు. ''ఎస్. రాజేశ్వరరావు, మ్యూజిక్ డైరెక్టర్''.

అంతే! అతని మనసు నిర్మలమైపోయింది.

మనముందు తరపు వ్యక్తులు కూడా సినిమా రంగాన్ని తిట్టుకుంటూ పారిపోతే మనకి రాజేశ్వరరావు లేడు. మనకి భానుమతీ లేదు. సావిత్రీ లేదు. గూడవల్లీ, బియన్ రెడ్డి, కెవి రెడ్డి, ఎల్వీప్రసాద్, ఎన్వీఆర్, గుమ్మడీ ఎవరూ ఎవరూ లేరు.

ఎప్పుడైనా కింద బురదే వుంటుంది. బురదలోంచే పంకజాలు వచ్చేది.

పంకానికి భయపడితే పంకజాలూ లేవు.

కేశవరావు జ్ఞానోదయమైనప్పుడు లభించే శాంతితో గొప్ప ఆనందంతో ముందుకి నడిచాడు.

ఆ నడకలో ఉత్సాహం... నిశ్చయం...

★



## బహిష్టు నొప్పికి మిరియాలు

కొందరు స్త్రీలకు బహిష్టు సమయంలో విపరీతంగా పొత్తికడుపులో నొప్పి వస్తుంటుంది. దీని నివారణకు ఒక్కోసారి ఎన్నిమందులు వాడినా ప్రయోజనం ఉండదు. బహిష్టునొప్పితో బాధపడుతున్నప్పుడు ఈ విధంగా చేసిచూడండి.

– మిరియాలు, వెల్లుల్లిపాయలు, మూర్కొండాకు సమభాగాలుగా నూరి వేప గింజంత మాత్రలు చేయాలి. బహిష్టువున్న రోజులలో ఈ మాత్రలను పుచ్చుకుంటే నొప్పి తగ్గుతుంది.

– కాకరాకు పసరు, ఇంగువ కలిపి నూరి బహిష్టు మూడురోజులు రెండుపూటలా తీసుకుంటే నొప్పి తగ్గుతుంది.

– ఆవు వెన్నలో కొద్దిగా రాతిసున్నం కలిపి రెండుపూటలా తీసుకుంటే బహిష్టు నొప్పి తగ్గుతుంది.

– తంగేడువేరు, మిరియాలు సమభాగాలుగా తీసుకొని నీళ్లతో నూరి ఉదయం, సాయంత్రం కుంకుడు గింజంత మాత్ర పుచ్చుకుంటే నొప్పి హరిస్తుంది.

– గుల్లసున్నం, కాకరాకు కలిపి నూరి కుంకుడు కాయంత మాత్రలు రెండుమూడు రోజులు పుచ్చుకుంటే నొప్పి తగ్గుతుంది.

– ఇంగువ, గచ్చపప్పులను నేతితో వేయించి నూరి మాత్రలు చేసి సేవించినా బహిష్టు నొప్పి తగ్గుతుంది.